సాక్షి
జనగామ
శుక్రవారం । 19 । జనవరి । 2024



క్రీడాకారులను ప్రోత్సహించాలి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. - 8లో▸



అప్రమత్తతే 'శ్రీరామ' రక్ష

సైబర్ నేరగాళ్లు శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ పేరుతో నకిలీ వెబ్‌సైట్ల ద్వారా లింకులు పంపి డబ్బులు కాజేస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33⁰/19⁰

వాతావరణం

మంచు కారణంగా ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

గురుకులంలో అడ్మిషన్లకు చివరి అవకాశం

జనగామ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 20వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి కనగాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి పూర్తి చేసి ఐదవ తరగతిలో చేరడానికి నిర్వహించే పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న జిల్లా కేంద్రంలో పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారం అడ్మిషన్ కేటాయిస్తామని పేర్కొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని రెండు తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాల, పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశానికి మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ, ఇంటర్ ఫస్టియర్‌కు ఫిబ్రవరి ఆరో తేదీ వరకు www.tmreis.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93469 51278, 99519 33084 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నీటి శుద్ధీకరణలో ఉత్తమ అవార్డు



చిల్పూరు: మండల కేంద్రంలోని బాలవికాస ప్లాంట్ ఉత్తమ నీటి శుద్ధీకరణతోపాటు ఆర్థికాభివృద్ధి పరంగా నడిపించిన సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ బాలవికాస వ్యవస్థాపకురాలు బాలక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బాలవికాస తాగునీటి శుద్ధీకరణ పథకం కమిటీ మహాసభలు కాజీపేటలో గురువారం నిర్వహించగా.. మూడు రాష్ట్రాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. ఆర్థికాభివృద్ధి పరంగా బెస్ట్ అవార్డును రాజ్‌కుమార్‌తో పాటు ఎస్.రాజు, సోమ రవికుమార్, యాదగిరి అందుకున్నారు.

ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: జిల్లా పరిధి మూడు నియోజకవర్గాల ఓటర్లు జాబితాలో తప్పనిసరిగా పేర్లు సరిచూపుకోవాలని కలెక్టర్ శివలింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ– 2024లో భాగంగా ఆయా నియోజకవర్గాల్లోని ఎంపీడీఓ, ఈఆర్వో కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లో జాబితా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫారం–6 నమోదు చేయాలన్నారు. అభ్యంతరాలు ఉంటే ఫారం–7, సవరణకు ఫారం–8 నమోదు చేసి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సంబంధిత అధికారులకు అందజేయాలని తెలిపారు.

ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

జనగామ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈనెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు జనగామ ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈ నెల 22వ తేదీ చివరి అవకాశంగా ఎన్నికల సంఘం నిర్ణయించిందని పేర్కొన్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు కోసం ఫారం –12 ద్వారా నమోదు చేయాలని చెప్పారు. 2024 జనవరి నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లయిన విద్యార్థులు అర్హులని, ఫిబ్రవరి 6 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని ఈ సందర్భంగా వివరించారు.

ధరణి కమిటీకి జనగామ న్యాయవాది..



సాధిక్ అలీ

జనగామ: రాష్ట్రంలో ధరణి సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కమిటీలో జనగామ న్యాయవాది సాధిక్ అలీకి అవకాశం వచ్చింది. ధరణితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సాధిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాధిక్ అలీ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్ వేదికగా ధరణిపై నిర్వహించే సమావేశానికి రావాలని సాధిక్‌కు ఆహ్వానం అందింది.

పడకేసిన ప్యాడీ డ్రయర్

- జనగామ మార్కెట్‌లో రూ.కోటి నిధులతో ఏర్పాటు
- నిర్వహణ భారంతో పట్టించుకోని అధికారులు
- అవగాహన లేక ఆసక్తి చూపని రైతులు
- ఏడేళ్లుగా నిరుపయోగంగానే..



మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్యాడీ డ్రయర్ సముదాయం

జనగామ: పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో మొదటిసారి జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ప్యాడీ డ్రయర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అధిక తేమ ఉన్న ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చే రైతులకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుంది. వ్యవసాయ క్షేత్రాల్లో ఆరబోసుకునేందుకు స్థలాలు లేకపోవడం, కూలీల కొరత నేపథ్యంలో ధాన్యాన్ని కల్లం నుంచి నేరుగా అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్‌లో ప్యాడీ డ్రయర్ ఉన్నప్పటికీ అవగాహన లేకపోవడం, యంత్రానికి అయ్యే డీజిల్ ఖర్చును అదనపు భారంగా భావించి వినియోగించడంలేదు.

2016 ఫిబ్రవరి 23న ప్రారంభం

జిల్లా కేంద్రం వ్యవసాయ మార్కెట్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.ఒక కోటి నిధులతో ప్యాడీ డ్రయర్ ఏర్పాటు చేశారు. ఆర్థిక శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు 2016 ఫిబ్రవరి 23న ఈ యంత్రాన్ని ప్రారంభించారు. తేమ అధికంగా ఉన్న ధాన్యాన్ని ఇందులో పోస్తే సూకాగా మారుతుంది. దీంతో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందొచ్చు. దీనిపై మార్కెట్‌కు వచ్చే రైతులకు అవగాహన కల్పించారు. తేమ మాట అటుంచితే.. తరుగు ఎక్కువగా పోతుందనే ఆందోళనతో పాటు మార్కెట్ కల్లం నుంచి ధాన్యాన్ని ప్యాడీ డ్రయర్ వరకు తీసుకువెళ్లేందుకు రవాణా ఖర్చు, హమాలీ చార్జీలు రైతులే భరించాల్సి ఉంటుందనే నిబంధన కారణంగా ఎవరూ ముందుకు రావడంలేదు. రైతుల అనుమానాలను నివృత్తి చేయడానికి అధికారులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించినా ఉపయోగంలేకుండా పోయింది. రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని కాటన్ యార్డులో ఆరబోసుకున్నారే తప్ప డ్రయర్ సేవలను వినియోగించుకోలేదు. ఫలితంగా రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన డ్రయర్ కాస్తా సరుకులు నిల్వ చేసే గోదాంగా మారిపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏడేళ్లుగా నిరుపయోగం..

మార్కెట్‌లో ప్యాడీ డ్రయర్ ఏర్పాటు చేసిన తర్వాత 2017 చివరి వరకు మాత్రమే ఉపయోగించుకున్నారు. కేవలం 50 మంది రైతులు మాత్రమే ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. 2016 సంవత్సరంలో రబీ, ఖరీఫ్ సీజన్లలో కేవలం ఎనిమిది మంది రైతులు మాత్రమే ప్యాడీ డ్రయర్ ద్వారా ధాన్యంలోని తేమను తగ్గించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందారు. 2017 సంవత్సరం కత్తెర పంట సాగు సమయంలో మరికొంత మంది ఉపయోగించుకున్నారు. 2018లో వానాకాలం, యాసంగి సీజన్లలో ఒక్క రైతు కూడా డ్రయర్ వైపు చూడలేదు. మార్కెట్ అధికారులు కూడా దీనిపై పెద్దగా స్పందించలేదు. రైతులు రవాణా, హమాలీ చార్జీలు భరించేందుకు ముందుకు వచ్చే పరిస్థితి ఉన్నా.. డీజిల్ ఖర్చు భారమవుతుందనే ఉద్దేశంతో అధికారులు డ్రయర్‌ను గాలికి వదిలేశారు. దీంతో ఏడేళ్లుగా డ్రయర్‌ను బస్తాలు నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారు.

ఇప్పుడైనా వినియోగంలోకి వచ్చేనా..?



వృథాగా ఉన్న యంత్రాలు

జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం దిగుబడులు రికార్డు స్థాయిలో వస్తున్నాయి. రైతులు పొలం వద్దే యంత్రాల ద్వారా ధాన్యం కోయిస్తూ ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లు, వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. తేమ 35 నుంచి 40 శాతం ఉండడంతో మద్దతు ధర కోల్పోతున్నారు. ప్రభుత్వ సెంటర్లలో రోజుల తరబడి ఆరబోస్తూ అన్నదాత కుటుంబాలు అష్టకష్టాలు పడుతున్నాయి. మార్కెట్‌కు వచ్చిన రైతులు కల్లంలో ధాన్యం ఆరబోసి ప్రైవేట్‌లో క్వింటాకు రూ.200 నుంచి రూ.400 తక్కువకు అమ్ముకుంటున్నారు. ప్యాడీ డ్రయర్ ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పిస్తూ.. రవాణా, హమాలీ చార్జీలు, డీజిల్ ఖర్చులు మార్కెట్ భరించి.. కోటి విలువైన డ్రయర్‌ను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ప్యాడీ డ్రయర్ సేవలు నిరుపయోగమే..



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ప్యాడీ డ్రయర్ సేవలు వినియోగించ లేము. ధాన్యంలో తేమ తొలగించాలంటే డీజిల్ ఖర్చు మార్కెట్‌పై అదనపు భారం పడుతుంది. అవసరం లేదని భావించి ఈ యంత్రం ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించడం లేదు.

– బాల్దె సిద్దిలింగం, మార్కెట్ కమిటీ చైర్మన్

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

- డీఆర్డీఓ మొగులప్ప



మల్కపేట నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ

నర్మెట: నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ఉపాధి పనుల్లో ప్రతీ గ్రామంలో 50 మంది కూలీలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీఓ మొగులప్ప అన్నారు. మండల పరిధి హన్మంతాపూర్, మల్కపేట నర్సరీలను అడిషనల్ డీఆర్డీఓ చంద్రశేఖర్‌తో కలసి గురువారం పరిశీలించిన అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నర్సరీల్లో ఖాళీ బెడ్లు ఉంచొద్దని, విత్తన నారుమళ్లలో కలుపువిత్తనాలు రాకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు. నీటి వసతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పనులను మూడువందల శాతానికి పెంచి ఆదిశగా కూలీలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎండీ.ఖాజామొయినుద్దీన్, ఎంపీఓ అరవింద్ చౌదరి, ఏపీఓ రమాదేవి, కార్యదర్శి కందకట్ల శ్రీధర్, టీఏ బాబు, ఎఫ్ఏ రమేష్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బచ్చన్నపేట : ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగి సమాజంలో పురుషులతో సమానంగా జీవించాలని గ్రామీణాభివృద్ధి అధికారి మొగులప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రచనా సమాఖ్య మండలి భవనంలో మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్‌ను ప్రవేశపెట్టినదని, ఆ యాప్‌లో సంఘం సభ్యుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. సంఘం ఆర్థిక లావాదేవీల వివరాలను ప్రతి నెలా నమోదు చేస్తే సభ్యుల సమాచారం సమగ్రంగా ఉంటుందన్నారు. సంఘంలో అప్పు తీసుకున్న సభ్యులు వాయిదాలను సకాలంలో చెల్లించి మరికొంత మందికి అప్పులు ఇవ్వడానికి సహకరించాలని కోరారు. అడిషనల్ డీఆర్‌డీఓ నూరొద్దీన్, డీపీఎం వినీత, ఏపీఎం నాగేశ్వర్‌రావు, డీఎంజీ గోవర్ధన్, సీసీలు విజయలక్ష్మి, తిరుమల, నర్సింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర వేలం ఆదాయం రూ.6.76 లక్షలు



గద్దెల వద్ద పూజలు చేస్తున్న చైర్మన్ మనోజ్‌రెడ్డి

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి–కొండాపూర్ గ్రామ పంచాయతీల సరిహద్దులో నిర్వహించే శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరలో పూజా సామగ్రి, కోళ్లు, మద్యం విక్రయ హక్కు కోసం గురువారం వేలం నిర్వహించారు. కొబ్బరి కాయల విక్రయాన్ని రూ.44వేలకు వెలిశెట్టి రాజు, బెల్లం రూ.81వేలకు కీలోతు రమేష్, కోళ్లు రూ.1.31 లక్షలకు పాలబోయిన రాజు, మద్యం(పెద్ద తీర్థం) రూ.4.20 లక్షలకు రంగు మహదేవ్ విక్రయ హక్కు దక్కించుకున్నారు. వేలం ద్వారా మొత్తం రూ.6.76 లక్షల ఆదాయం వచ్చినట్లు జాతర కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు ఉదయం జాతర ప్రాంగణంలోని దేవతల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ లోడెం రజితరవీందర్, ఎంపీటీసీ అయిలమ్మ, ఎల్లయ్య, ఉప సర్పంచ్‌లు గొంగిడి అనురాధకృష్ణమూర్తి, కొడ సంపత్, వెలిశాల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె కళాకారులకు ప్రశంసలు



ప్రశంస పత్రాలతో అప్పిరెడ్డిపల్లె కళాకారులు

దేవరుప్పుల : అయోధ్యలో శ్రీరామమందిర పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రం తరపున సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించిన మండలంలోని అప్పిరెడ్డిపల్లె చిందు యక్షగాన కళాకారులకు ప్రశంస పత్రాలతో ఘనసత్కారం లభించింది. గురువారం అయోధ్యలోని నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ నాగపూర్ విభాగం ఆధ్వర్యంలో గడ్డం సమ్మయ్య బృందానికి నిర్దేశించిన 'సీత అరణ్యవాసం, లవకుశ, మైరావణ, సీతా రామకల్యాణం' విభాగాల్లో యక్షగాన కళారూపాల ప్రదర్శన పూర్తయింది. ఈ సందర్భంగా సమ్మయ్య బృందం సభ్యులను ప్రోగ్రామ్ డైరెక్టర్ అజయ్‌గుప్తా సత్కరించినట్లు బృందం ప్రతినిధి జి.హిమగిరి తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు సోమరాజు, సాంబయ్య, రఘుపతి, యాకయ్య, శ్రీపతి, రమేష్, ధనుంజయ, చిన్న సమ్మయ్య, శంకరయ్య, సుదర్శనం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందాం

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందాం.. ఇందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి తమకు తెలియజేయజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అధికార దుర్వినియోగానికి పాల్పకుండా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారెంటీ పథకాలు అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, బండిపెల్లి మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



హనుమకొండ రోడ్డులోని మురుగు కాల్వను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జనగామ రూరల్: పట్టణ పరిధి అన్ని వార్డుల్లో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక బస్టాండ్ ఏరియా, హైదరాబాద్ రోడ్డులోని సురక్ష ఆస్పత్రి ప్రాంతం, హనుమకొండ రోడ్డులోని జలాల వాటర్ ప్లాంట్ సమీప ప్రధాన మురుగు కాలువ, కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని కల్వర్టుల కింద ఉన్న సిల్ట్ తొలగించాలని చెప్పారు. అధునాతన పద్ధతులతో కాల్వలను శుభ్రం చేసేందుకు పరికరాలు సమీకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి తదితులు పాల్గొన్నారు. అనంతరం వడ్లకొండ రోడ్డులోని సఖీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పనులను ఈనెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నాక రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జయంతి, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హుస్సేన్, నిర్వాహకురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ కన్వీనర్ రాజు, తదితరులు

జనగామ : పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా జనగామ సమస్యలను ఏ నాయకుడు పట్టించుకోలేదని, ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వసతుల కల్పన, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ పరికరాలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తెలంగాణ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తుంగ కౌశిక్, దికొండ హరీష్, మహమ్మద్ ఇమ్రాన్, కొయ్యడ రవి పలువురు పాల్గొన్నారు.

టెక్నోఫెస్ట్‌కు రెడీ..

- నిట్‌లో నేటినుంచి ఇంజీనియస్ (టెక్నోజియాన్)-24
- మూడు రోజుల పాటు సాంకేతిక మహోత్సవం
- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద టెక్నోఫెస్ట్
- హాజరుకానున్న 6వేల మంది విద్యార్థులు
- ఈ ఏడాది ప్రో షోలు రద్దు
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న తిరుచి మాజీ డైరెక్టర్ శ్రీనివాసన్ సుందరరాజన్



నిట్‌లో ఇంజీనియస్ థీం వద్ద విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహించే మూడు రోజుల సాంకేతిక మహోత్సవం టెక్నోజియాన్–24 శుక్రవారం ప్రారంభంకానుంది. దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద టెక్నోఫెస్ట్‌గా పేరుగాంచిన ఈ సాంకేతిక మహోత్సవానికి దేశవ్యాప్త ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 6వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సాంకేతిక విద్య, ఆవిష్కరణలను పంచుకునే వేదికగా టెక్నోజియాన్–24 నిలవనుంది.

ఇంజీనియస్‌గా టెక్నోజియాన్–24..

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు, పరస్పరం సాంకేతికతను పంచుకునేందుకు నిట్ వరంగల్‌లో 2006 సంవత్సరంలో టెక్నోజియాన్ వేడుకలు ప్రారంభించారు. ప్రతి ఏడాది వివిధ థీంలతో ఆవిష్కరిస్తున్న ఈ వేడుకకు ఈ ఏడాది ఇంజీనియస్‌గా నామకరణం చేశారు. ఇంజీనియస్ అంటే నూతన ఆవిష్కరణలు, సాంకేతికత స్ఫూర్తి అని అర్థం.

40 టెక్నికల్ ఈవెంట్లు..

టెక్నోజియాన్–24 (ఇంజీనియస్)ను 40 టెక్నికల్ ఈవెంట్లతో రూపొందించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల్లో స్పాట్‌లైట్స్ పేరిట జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, వర్చువల్ రియాల్టీ, డీ బగ్గింగ్ మానియాలతో అలరించనుంది. మ్యాట్‌ల్యాబ్, టీ–వర్క్స్, రాపిడ్ ప్రోటోటైపింగ్, సిమూలింక్ మాస్టర్, ఇన్సోసర్ఫ్ వంటి వర్క్‌షాప్స్ ఆకర్షణగా నిలవనున్నాయి. నిట్ మెకానికల్ విభాగానికి చెందిన స్పర్థక్ టీం వెహికిల్ ఎగ్జిబిషన్ ప్రత్యేకంగా నిలవనుంది. అదే విధంగా గెస్ట్ లెక్చర్స్ అయిన రెడ్‌బస్ సీఈఓ ప్రకాష్ సింగం, ఇస్రో సైంటిస్ట్ టీఎస్.సురేష్‌కుమార్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించనున్నారు.

ప్రో షోలు రద్దు...

ప్రతి ఏడాది టెక్నోఫెస్ట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్పాట్‌లైట్స్, వర్క్‌షాప్స్‌లలో విద్యార్థులు సాంకేతిక విద్యను పంచుకుని రాత్రి వేళ్లలో నిట్ మైదానంలో ఉత్సాహంగా ప్రో షోలు నిర్వహించేవారు. ఈ ఏడాది ప్రోషోలు అయిన వివిధ ఆర్టిస్టులతో పాటలు పాడించడం, డ్యాన్స్, ర్యాంప్‌పై మోడలింగ్ వంటి వాటిని రద్దు చేశారు. టెక్నాలజీని మాత్రమే పంచేందుకు వేదికగా సిద్ధం చేసినట్లు సమాచారం.

నేడు లాంఛనంగా ప్రారంభం...

నిట్ వరంగల్‌లో నిర్వహించనున్న టెక్నోజియాన్–24ను నిట్ తిరుచి మాజీ డైరెక్టర్, సైంటిస్ట్, ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులకు డిఫెన్స్, రీసెర్చ్ సెంటర్లపై స్ఫూర్తినిచ్చే ప్రసంగం చేయనున్నారు.

నూతన ఆవిష్కరణలకు వేదిక: బిద్యాధర్ సుబుదీ, నిట్ డైరెక్టర్



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులు సమాజానికి దోహదపడే నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు వేదికగా ఇంజీనియస్ టెక్నోజియాన్–24 నిలుస్తుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్‌లోని సెనేట్ హాల్‌లో గురువారం ఆయన టెక్నోజియాన్–24 వివరాలను వెల్లడించారు. విద్యార్థులు నగరంలోని మున్సిపల్ శాఖకు దోహదపడేందుకుగాను మురుగు కాలువలు, చెత్తడబ్బాలు నిండిపోయిన తరుణంలో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించేందుకు ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సాయంతో ఏర్పాటు చేసిన సెన్సార్‌లను ఉపయోగించేందుకు ప్రత్యేక యాప్‌లను రూపొందించారని తెలిపారు. దేశవ్యాప్త సాంకేతిక కళాశాలలతో పాటు, నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు, టెక్నోజియాన్–24ను వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ శ్రీనివాసాచార్య, టెక్నోజియాన్–24 టీం సభ్యులు పాల్గొన్నారు.

'ఆరుట్ల'కే రెండోసారి అవకాశం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దశమంతరెడ్డి



జనగామ రూరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి.. ఆరుట్ల దశమంత్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకే పార్టీ తిరిగి అవకాశం కల్పించింది. దీంతో శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులు 'ఈ–శ్రమ్' కార్డులు పొందాలి

జనగామ రూరల్: అసంఘటిత రంగంలో పని చేస్తున్న జిల్లాలోని కార్మికులు తప్పనిసరిగా ఈ–శ్రమ్ కార్డులు పొందాలి.. ఇందుకు సంబంధిత పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక అధికారి కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కార్మిక కుటుంబానికి రూ.2లక్షలు, అంగవైకల్యం అయిన వారికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తారని పేర్కొన్నారు. బీమా కోసం 2022 మార్చి 31 వరకు పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు ఎక్స్‌గ్రేషియాకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈనెల 19లోపు కలెక్టరేట్ ఎస్–25 రూంలో సంబంధిత ప్రతాలు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94925 55275, 91820 73288 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

22 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సీఈఎల్‌టీ) డైరెక్టర్ మేఘనారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 రోజులపాటు నిర్వహించే తరగతుల్లో వివిధ అంశాలపై నిష్ణాతులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు రూ.1,000, మిగిలిన వారు రూ.1,500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో జరిగింది. ఎస్సై రాణాప్రతాప్ కథనం ప్రకారం మండలంలోని నాయక్‌పల్లికి చెందిన బుర్రి ఉప్పలయ్య (56) బుధవారం మండలంలోని గుండెంగలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యాడు. అనంతరం రాత్రి ద్విచక్రవాహనంపై నాయక్‌పల్లికి వస్తున్న క్రమంలో అయోధ్యపురం- వాయిల్‌బంధం దారిలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున ఆ దారి వెంట వస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. ఉప్పలయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు రాజు ఉన్నాడు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.10 లక్షలు పోగొట్టుకున్న రైల్వే ఉద్యోగి

కాజీపేట: ఆన్‌లైన్ గేమ్‌కు ఆకర్షితుడైన ఓ రైల్వే ఉద్యోగి.. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.10 లక్షలు పోగొట్టుకున్నారు. కాజీపేట పట్టణంలోని రైల్వే ఎలక్ట్రికల్ షెడ్‌లో టెక్నీషియన్‌గా పనిచేసే రాజస్థాన్‌కు చెందిన లోకేష్ ఖాళీ సమయంలో తరుచూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతాడు. సైబర్ నేరగాళ్లు మొదట రూ.5 లక్షల వరకు డబ్బులు గెల్చుకునేలా నమ్మించారు. దీంతో ఈ ఆట సులువుగా ఉందని, ఇలాగే కొనసాగితే మరిన్ని లక్షలు రావడం ఖాయమని నమ్మిన లోకేష్.. ఆట కొనసాగించాడు. మొదట నమ్మించి ముగ్గులోకి దింపిన సైబర్ నేరగాళ్లు.. లోకేష్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 10 లక్షలు, గెల్చుకున్న రూ.5 లక్షలు కాజేసి ఆన్‌లైన్ నుంచి మాయమయ్యారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పూర్తిగా పోయినట్లు ఆలస్యంగా గుర్తించిన లోకేష్ లబోదిబోమంటూ 1930కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్నేహితుల సూచన మేరకు గురువారం కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్రమత్తతే 'శ్రీరామ'రక్ష..

రాముడినీ వదలని సైబర్ నేరగాళ్లు
- అయోధ్య రామమందిరానికి విరాళాలంటూ నకిలీ క్యూఆర్ కోడ్‌లు
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పేరుతోనూ ఫేక్ వెబ్‌సైట్లు
- ఆలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు
- వివిధ రూపాల్లో భక్తుల నుంచి క్యాష్ చేసుకుంటున్న మోసగాళ్లు..
- అనుమానాస్పద లింక్‌లు, క్యూఆర్ కోడ్‌ల జోలికి వెళ్లొద్దంటున్న పోలీసులు



సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్ల మోసాలకు అంతే ఉండడం లేదు. బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరిట సెల్‌ఫోన్లకు లింక్‌లు పంపుతున్నారు. ఈ విషయం తెలియని అమాయకులు వాటిని ఓపెన్ చేస్తున్నారు. దీంతో క్షణాల్లో తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అవుతోంది. అయితే తరహా మోసాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో కొంతమేర మార్పువచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చారు. ప్రస్తుతం రామమందిర అంశాన్ని వినియోగించుకుంటున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం కోసం వేయికండ్లతో వేచి చూస్తున్న భక్తులకు శఠగోపం పెట్టే కార్యక్రమానికి సైబర్ నేరగాళ్లు తెరలేపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు కావాలంటూ కొందరు.. అక్కడికి వచ్చే భక్తులకు ప్రసాదం పంపిణీకి విరాళాలు కావాలంటూ ఇంకొందరు నకిలీ క్యూ ఆర్ కోడ్‌లు సృష్టించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కొందరు భక్తులు ఇది నిజమని నమ్ముతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే, అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మొబైల్ రీచార్జ్‌లో భారీ రాయితీలు ఉన్నాయంటూ సెల్‌ఫోన్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏదీఏమైనా భక్తిని క్యాష్ చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా నేరాలకు తెరలేపిన నేపథ్యంలో భక్తులు జాగ్రత్తగా ఉండాలని వరంగల్ కమిషనరేట్ పోలీసులు సూచిస్తున్నారు. కొన్ని రోజులు ఫోన్లు, వాట్సాప్‌ల్లో సందేశాలు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించి...

అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ ఈ నెల 22న జరగనుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమం కొనసాగింది. ఒకటి నుంచి 15 వరకు ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందజేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఇది జరగడంతో పాటు ప్రధాని మోదీ అయోధ్యను సందర్శించడం, ఈ నెల 22న అంగరంగ వైభవంగా జరుగుతుందని విస్తృత ప్రచారం రావడంతో మరికొందరు సైబర్ నేరగాళ్లు మిగతా ఆలయ పనులు త్వరగా పూర్తయ్యేందుకు విరాళాలు అవసరమని నకిలీ వెబ్ సైట్లు సైతం సృష్టించారు. ఆలయ నిర్మాణానికి తమకు తోచిన సాయం చేయాలని భక్తులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ల కోసం వెతుకుతుండడాన్ని దృష్టిలో ఉంచుకుని 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు' పేరుతో నకిలీ వెబ్ సైట్లు రూపొందించారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ నకిలీ సైట్లతో పాటు సైబర్ నేరగాళ్లు పంపించే లింక్‌లను తెరవొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ లింక్‌ల వల్ల ఖాతాల్లోని డబ్బులు కొల్లగొట్టడంతో పాటు ఆయా మొబైల్ ఫోన్‌లలో ఉన్న వ్యక్తిగత సమాచారం కూడా తస్కరణకు గురయ్యే అవకాశముందని, ఆ సెల్ ఫోన్‌కు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. ఎక్కడైనా ఎవరైనా మోసపోతే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

నకిలీ యూపీఐ ఐడీలు ఇలా..

ఇప్పటికే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు.. విరాళాల కోసం శ్రీరామ్ జన్మభూమి పేరుతో ఎస్‌బీఐ వివరాలతో కూడిన యూపీఐ ఐడీ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచింది. దీనికి దగ్గరి పోలికలతోనే కొంతమంది నకిలీ యూపీఐ ఐడీలను అదే ఎస్‌బీఐ ఖాతాలో ఓపెన్ చేసి వాట్సాప్‌ల్లో విరాళాలు ఇవ్వాలంటూ పంపుతున్నారు. ఇలా shriramjanambhomi@sbi, sriramjanambhoomi@sbi, shriramjanambhumi@sbi, sriramjanmbhoomi@sbi, sriramjanmbhumi@sbi... నకిలీ యూపీఐ ఐడీలు సృష్టించారని ఇప్పటికే అన్సుల్ అనే వ్యక్తి ట్విటర్ వేదికగా ఎస్‌బీఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఐడీలు ప్రైవేట్ వ్యక్తులు పేరు మీద ఉన్నాయని తెలిపారు.

ప్రజల్లోకి బాలవికాస పథకాలు..



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- బాలవికాస ప్రాంగణంలో నీటి శుద్ధికరణ మహాసభలు ప్రారంభం

కాజీపేట రూరల్: సమాజంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ప్రాంగణంలో గురువారం ప్రారంభమైన నీటి శుద్ధికరణ పథకాల సుస్థిరతలో 'గ్రామ పంచాయతీ-కమిటీల పాత్ర' అనే అంశంపై 1500 వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులతో నిర్వహించిన మహాసభలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం చేపట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందన్నారు. మహిళా పథకాలు, లీడర్‌షిప్ క్వాలిటీ, చెరువు పూడికతీత, అనాథ పిల్లలు, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. నూతన పథకాలకు కేరాఫ్.. ప్రభుత్వాలకు దీటుగా బాలవికాస సేవలు ఆదర్శనీయమన్నారు. వితంతు విముక్తి ఉద్యమం ద్వారా మూఢనమ్మకాలను పారద్రోలడంలో బాలవికాస చేస్తున్న అభినందనీయమన్నారు. బాలవికాస ఫౌండర్, సభాధ్యక్షురాలు బాలతెరిసా మాట్లాడుతూ 47 ఏళ్ల నుంచి కెనడా సోఫార్ సంస్థ అనుబంధంతో బాలవికాస సంస్థ ప్రజలకు సేవలు అందిస్తూ ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలవికాస సేవలు రైతుల నుంచి నిరుద్యోగుల వరకు అండగా ఉంటాయన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో విస్తరించిన నీటి శుద్ధీకరణ కమిటీలు నిత్యం వాటర్ ప్లాంట్లను పర్యవేక్షించాలన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేదం లింగమూర్తి మాట్లాడారు. కాగా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వాటర్ ప్లాంట్ల అధ్యక్ష, కమిటీ మెంబర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సోఫార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మర్రెడ్డి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, పీడీటీసీ డైరెక్టర్ సునీతారెడ్డి, సీనియర్ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లత, మంజుల, ప్రాన్సీస్‌రెడ్డి, తిరుపతి, శోభ, శివరాం, మొగిలి, విజేందర్, మోసిన్, జాన్‌పాల్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ. 7లక్షల నగదు అపహరణ
- నర్సంపేటలో ఘటన



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవి కుమార్

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు రూ. 7లక్షలు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండకు చెందిన మొల్గూరి నాగేందర్ కొంతకాలంగా నర్సంపేట పట్టణం సర్వాపురం శివారులోని సాయి నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. నాగేందర్ జాతరల్లో జాయింట్ వీల్స్ నడిపిస్తుంటాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం కుటుంబ సమేతంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ జాతరకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వెళ్లే సరికి వెనుక గది తాళం పగలగొట్టి ఉంది. గదిలోని వస్తువులనీ చిందరవందరగా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి చూడగా ఇంట్లో భద్రపరిచిన రూ.7లక్షలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నర్సంపేట టౌన్ సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకోని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. దీనిపై ఎస్సై రవి వివరణ కోరగా నాగేందర్ ఇంట్లో చోరీ జరిగింది వాస్తవమేనని, రూ. 7లక్షలు అపహరణకు గురయ్యాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి





బాలుర విభాగంలో గెలుపొందిన వరంగల్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి , బహుమతి అందుకుంటున్న వరంగల్ బాలికల జట్టు

క్రీడల అభివృద్ధికి సహకారం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ముగిసిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

జనగామ: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్-14 బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు పోటీలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. పాఠశాల చుట్టూ పెన్సింగ్ నిర్మాణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన అనంతరం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు.. ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందించారు. కాగా, దేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యం తెలుపుతూ నృత్య ప్రదర్శన చేసిన చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పల్లా

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే ..

నిత్యం రాజకీయ కార్యకలాపాలతో బిజీగా గడిపే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండర్-14 కబడ్డీ రాష్ట్ర స్థాయి ముగింపు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

గెలుపొందిన జట్లు ఇవే..

రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు విజయకేతనం ఎగురవేశాయి. బాలుర విభాగంలో వరంగల్ జిల్లా (ప్రథమం), నల్లగొండ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా (తృతీయ), బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా(ప్రథమం), వరంగల్ జిల్లా(ద్వితీయ), ఖమ్మం జిల్లా(తృతీయ) స్థానంలో నిలిచాయి. ఇందులో జాతీయ స్థాయికి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఏపీలోని కడపలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలుర జట్టు పాల్గొంటుంది. అలాగే, ఈ నెల 24 నుంచి 28 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో బాలిక జట్టు పాల్గొంటుంది.

మార్కెట్ కార్యదర్శిపై విచారణ పెండింగ్

- బిజీతో వాయిదా వేసిన డీడీఎం
- త్వరలో విచారణ తేదీ ప్రకటన

వరంగల్: ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన రాహుల్‌పై వచ్చిన ఆరోపణలపై చేపట్టిన విచారణ వాయిదా పడింది. వరంగల్ బాలాజీ నగర్‌కు చెందిన మహేష్.. రాహుల్‌పై పలు ఆరోపణలు చేస్తూ గతేడాది అక్టోబర్ 4వ తేదీన మార్కెటింగ్‌శాఖ అడిషనల్ సెక్రటరీ ఎల్.సరితా రాణికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అడిషనల్ సెక్రటరీ అదే నెల 5వ తేదీన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక అందించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి వరంగల్ ఆర్‌డీడీఎం అజ్మీరా రాజునాయక్‌ను ఆదేశించారు. ఆర్‌డీడీఎం రాజు నాయక్ 2024 జనవరి 19వ తేదీన మార్కెట్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఫిర్యాదుదారుడు మహేష్‌తో పాటు మార్కెట్ సెక్రటరీ రాహుల్‌కు గత నెల 28వ తేదీన నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదుదారుడు మహేష్ అడ్రస్ పేరు పేర్కొనకపోవడం, అందులో ఒక వ్యాపారి సెల్ నంబర్ ఉండడంతో సదరు వ్యాపారికి నోటీసులు అందజేసినట్లు తెలిసింది.

విచారణ తేదీ ప్రకటిస్తాం

మార్కెట్ కార్యదర్శి రాహుల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాఖ పరంగా విచారణ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 19వ తేదీన ఫిర్యాదుదారుడు, కార్యదర్శి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చాం. మిర్చి ధరలు పడిపోవడంతో మార్కెట్‌లను సందర్శించే బిజీలో ఉన్నాం. దీంతో విచారణ వాయిదా వేశాం. విచారణ తేదీని త్వరలో ప్రకటిస్తాం. **–రాజు నాయక్, ఆర్‌డీడీఎం**

రాహుల్‌పై ఆరోపణలు..

రాహుల్.. వరంగల్ గ్రేయిన్ మార్కెట్‌లోని అడ్తి వ్యాపారులకు ఇచ్చిన గదులకు అద్దెలు పెంచినట్లు నోటీసులు ఇచ్చి అడ్తిదారులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు కమీషన్ రూపంలో తీసుకున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు, అడ్తిదారులు కలసి కాటన్ జీరో వ్యాపారం చేసి డబ్బులు దండుకున్నట్లు ఆరోపించారు. అదే విధంగా ఏనుమాములలో ఉన్న ఎకరం భూమిని చాంబర్‌కు అతి తక్కువ ధర అద్దెకు అప్పజెప్పేందుకు బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపించారు. వ్యాపారులతో చేతులు కలిపి ఏనుమాముల మార్కెట్‌లో ఈ-నామ్ అమలు చేయకుండా లోపాయికారీ ఒప్పందం చేసుకుని జీరో పెద్ద ఎత్తున సాగేందుకు సహకారం అందించినట్లు ఆరోపించారు. అడ్తి లైసెన్సుల్లో సైతం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని, కూరగాయల మార్కెట్‌లో షాపుల కేటాయింపుల్లో చేతి వాటం ప్రదర్శించారని ఆరోపించారు. 'ఏదీ చెప్పినా అన్నింటికి డైరెక్టర్ మేడంతో మాట్లాడాను అనుమతి ఉంది. నాకేం కాదు అంటున్నాడని' ఫిర్యాదులో పేర్కొనడంతో విచారణకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

జనగామ రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఏరియాకు చెందిన కర్రె మల్లేశ్ ట్రావెల్స్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో మల్లేశ్ భార్య అంబిక (28) గతంలో తన పిల్లలకు బంగారం కావాలని తండ్రిని కోరింది. అయితే సంక్రాంతి పండుగకు పుట్టింటికి వెళ్లగా తండ్రి బంగారం విషయం చెప్పలేదు. దీంతో మనస్తాపం చెందిన అంబిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడల్లో తలపడుతున్న క్రీడాకారులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- అంబేడ్కర్ స్టేడియంలో కోల్‌ఇండియా హాకీ పోటీలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పని చేస్తున్న కార్మికులకు క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి ఏరియాలోని అంబేడ్కర్ స్టేడియంలో గురువారం కోల్ ఇండియా హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు సింగరేణి డైరెక్టర్ ఎస్‌వీకే శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల్లో మానసిక ఉత్తేజం నింపేందుకు క్రీడలు నిర్వహిస్తున్న సింగరేణి, కోల్ ఇండియా యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపు కోసం మరోసారి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు బసవయ్య, రమేష్, వెంకటయ్య, రాజ్‌కుమార్, ధర్మపురి, తుకారాం, కిరణ్‌కుమార్, పాల్గొన్నారు. కాగా, ఈ పోటీల్లో మొదట ఎస్‌సీసీఎల్ (తెలంగాణ) ఎంసీఎల్ (ఒడిశా) జట్లు తలపడగా ఎస్‌సీసీఎల్ జట్టు 2 గోల్ తేడాతో గెలిచింది. అనంతరం డబ్ల్యూసీఎల్(మహారాష్ట్ర, ఎన్‌సీఎల్ (మధ్యప్రదేశ్)జట్లు తలపడగా గోల్ తేడాతో ఎన్‌సీఎల్ జట్టు గెలుపొందింది.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

వాజేడు: లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 18 వేల జరిమానా విధిస్తూ ములుగు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి లలిత శివ జ్యోతి గురువారం తీర్పు వెలువరించారు. ములుగు కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ కమలాకర్ కథనం ప్రకారం వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం భూపతిరావు 2021 సంవత్సరంలో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్ రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సత్యనారాయణ బాధితుల పక్షాన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు భూపతిరావుకు 10 ఏళ్ల కారాగార శిక్ష, రూ.18 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వరకట్నం కేసులో మరో వ్యక్తికి మూడేళ్లు..

నర్సింహులపేట: వరకట్న వేధింపుల కేసులో మండలంలోని పడమటిగూడేనికి చెందిన కొండ రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత గురువారం తీర్పు వెలువరించారు. వరకట్న వేధింపుల ఘటనపై 2014లో తేజశ్విని తన భర్త రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టిన అనంతరం కోర్టులో హాజరుపర్చగా రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని ఎస్సై గంగ్రాతి సతీష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



షేక్ మహబూబ్‌బీ

ఐనవోలు: ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జగన్నాథపల్లి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బీ తన తల్లిదండ్రులతో కలిసి ఐనవోలు జాతరలో రింగుల దుకాణం ఏర్పాటు చేయడానికి ఈ 17వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు మండల కేంద్రానికి చేరుకుంది. తర్వాత కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. షేక్ మహబూబ్ బీ ఆచూకీ తెలిసిన వారు 8712685030, 8712685244 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

దాతలు దయచూపండి..

- తండ్రి, కుమారులకు కేన్సర్ వ్యాధి
- చికిత్సకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు
- సాయం చేయాలని వేడుకోలు



దీన గాధ



భార్య, ఇద్దరు కుమారులతో వేణుమాధవ్(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన మాదారపు వేణుమాధవ్, అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న వేణుమాధవ్, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు. వేణుమాధవ్‌కు కొంత కాలం క్రితం దవడ కేన్సర్ రాగా పలు ఆస్పత్రుల్లో సుమారు రూ. 20 లక్షల మేర ఖర్చు చేసి చికిత్స చేయించుకుని కోలుకుంటున్నాడు. అతడి పెద్ద కుమారుడు ఫణీంద్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరీక్షలు చేయించగా అతడికి బ్లడ్ కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి రోజు చికిత్సలు చేయించాలంటే రూ. వేలలో ఖర్చు అవుతుండడంతో వారి కుటుంబం ఆర్థికంగా దీనస్థితికి చేరింది. తమ కుమారుడి చికిత్స కోసం రూ. 50 లక్షల మేర ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని, అంతటి స్తోమత తమకు లేదని, వైద్యం కోసం సాయం అందించాలని తల్లి సునీత వేడుకుంటోంది.

సాయం చేసే వారు 90146 74308 నంబర్‌కు గూగుల్ లేదా ఫోన్‌పే చేయాలని బాధితులు కోరుతున్నారు.